క్లుప్తంగా

19న గండిలో టెండర్లు

చక్రాయపేట : గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో ఈనెల 19న ఈ టెండరు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఏడాది పాటు ఆలయ ప్రాంగణంలో కొబ్బరి కాయలు విక్రయించుకునేందుకు ఈ టెండర్ నిర్వహిస్తున్నామన్నారు. అలాగే షాపింగ్ కాంప్లెక్స్‌లో ఖాళీగా ఉన్న 9 గదులను లీజుకు ఇచ్చేందుకు కూడా వేలం పాట నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే వస్త్రాలు, స్టేషనరీ, ఎలక్ట్రికల్ సామాన్లు, ప్రింటింగ్, ఎంవీ పార్ట్స్ సరఫరా చేయుటకు, ఖాళీ నెయ్యి డబ్బాలు, ఖాళీ ప్లాస్టిక్ సంచులు, నిరుపయోగ వస్తువులు ఎల్ఈడీ కలర్ టీవీ విక్రయించుటకు టెండర్లు నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించి డిపాజిట్లు చెల్లించుటకు తమ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

సమాచార చట్టంపై అవగాహన



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి

ఎర్రగుంట్ల : మండలంలోని నిడుజివ్వి గ్రామం రైతు భరోసా కేంద్రంలో సమాచార హక్కు చట్టం–2005పై మండలస్థాయి సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ సమాచారం కొరకు దరఖాస్తు చేసుకున్న వ్యక్తికి పూర్తి సమాచారం నిర్ణీత గడువులోపు అందజేసి రసీద్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం బాటిళ్లు స్వాధీనం

కొండాపురం : మండల పరిధి తాడిపత్రి–కడప జాతీయ రహదారిలోని కె.సుగుమంచిపల్లె పెట్రోల్ బంక్ సమీపంలో ఓ గదిలో అక్రమ మద్యం విక్రయిస్తున్న సురేష్‌ను కడప ఎక్సైజ్ శాఖ స్క్వాడ్ టీం అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ శాఖ సీఐ విన్నిలత బుధవారం తెలిపారు. అతని వద్ద నుంచి 24 అక్రమ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

చెన్నూరులో సామాజిక తనిఖీ



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండలంలో 18వ విడత (2023–24) సామాజిక తనిఖీ మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో నిర్వహించారు. సోషల్ ఆడిట్ కార్యక్రమంలో 12000 రికవరీ పెట్టడం జరిగింది. అందులో రూ.2500 రికవరీ చేశారు. ఈ కార్యక్రమంలో డ్వామా అడిషనల్ పీడీ నాగరత్నమ్మ ప్రిసైడింగ్ అధికారిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీపీ సురేష్‌యాదవ్, ఎంపీడీఓ కిరణ్‌మోహన్ రావు, ఉపాధి హామీ సిబ్బంది, హౌసింగ్ సిబ్బంది, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధి తప్పనిసరి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి

కొండాపురం : రబీసీజన్‌లో సాగు చేసే శనగ విత్తనంను తప్పనిసరిగా శుద్ధి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రామంజులరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని బురుజుపల్లెలో రైతు సేవా కేంద్రంలో ఆయన రైతులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఒక కేజీ శనగలకు 5 గ్రాముల ట్రికో డెర్మా కలిపి తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. సాగు చేసిన వివిధ పంటల నమోదు జాబితాను రైతు బరోసా కేంద్రంలో రైతుల పేర్లను ప్రదర్శించామన్నారు. మినుము, శనగ సాగు సమయంలో విత్తన శుద్ధి చేసుకోవడం వల్ల మొలకశాతం బాగా వస్తుందన్నారు. తుఫాన్ ప్రభావం వల్ల పంటలకు నష్టం జరిగితే రైతు భరోసా సిబ్బంది దృష్టికి తీసుకుపోవాలన్నారు.



పులివెందులలో బుధవారం వర్షానికి కూలి పోయిన కౌన్సిలర్ కాంతమ్మ ఇల్లును పరిశీలిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లు

నాడు కళకళ.. నేడు విలవిల

గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సాధించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి నెరవేర్చింది. పల్లెల్లోనే ప్రజలకు సత్వరమే సమస్యలు పరిష్కారమయ్యేలా ఏర్పాటైన సచివాలయాలు ప్రస్తుతం నిరుపయోగంగా మారుతున్నాయి. గతంలో సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు 545 రకాల సేవలు అందేవి. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయాల్లో సేవలు నిర్వీర్యమయ్యాయి. ఇప్పటి వరకు ఏ ఒక్క ప్రభుత్వ వెబ్‌సైట్ కూడా ఓపెన్ కావడం లేదు. దీంతో కొత్త పింఛన్లు, రేషన్, ఆరోగ్యశ్రీ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అర్హులైన లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు.

- సచివాలయాలు నిర్వీర్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం
- కొత్త పింఛన్లు, రేషన్, ఆరోగ్యశ్రీ కార్డుల కోసం ఎదురుచూపులు



సింహాద్రిపురంలోని గ్రామ సచివాలయం

సింహాద్రిపురం : మండలంలోని సచివాలయాల్లో సేవలు అందకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు ఉద్యోగులు పనిలేక ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండలాల్లో 2వేల జనాభా ఉన్న గ్రామాల్లో రూ.40 లక్షలు వ్యయం చేసి నూతన సచివాలయాలు నిర్మించారు. గత ఐదేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన వివిధ రకాల సంక్షేమ పథకాలు అమలు చేయడంతో లబ్ధిదారులతో సచివాలయాల్లో సందడి కనిపించేది. మండలంలో 12 గ్రామ సచివాలయాల్లో 118 మంది సిబ్బంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

నాడు హేళన చేసిన వారితోనే పింఛన్ల పంపిణీ

గతంలో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ నేతలు సచివాలయ వ్యవస్థపై అడ్డుగోలుగా విమర్శలు చేశారు. సచివాలయాలు ఎందుకు.. అవి అసలు ఉద్యోగాలే కాదంటూ హేళన చేశారు. అయితే ఆ సచివాలయ ఉద్యోగులే ప్రస్తుతానికి కూటమి ప్రభుత్వానికి దిక్కుగా మారారు. గతంలో ప్రతినెలా 1వ తేదీనే వలంటీర్లు వృద్ధులు, వితంతు, వికలాంగులకు సూర్యోదయం కాకముందే ఇంటి వద్ద ఠంచన్‌గా పింఛన్ అందించేవారు. సచివాలయాల్లో సేవలను కూటమి ప్రభుత్వం పూర్తిగా కుదించింది. కూటమి ప్రభుత్వం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం పేరిట గ్రామాల్లో వారం రోజులపాటు సచివాలయ ఉద్యోగులతో కలిసి టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లు అతికించే పని అప్పగించి వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసింది.

కొత్త పింఛన్లు, రేషన్, ఆరోగ్యశ్రీ కార్డుల కోసం ఎదురుచూపులు

కూటమి ప్రభుత్వం ఏర్పాటై నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఒక్క పింఛన్, రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరు చేయకపోవడంతో లబ్ధిదారులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రస్తుతం సచివాలయాల్లో ఎలాంటి సేవలు అందకపోవడంతో వెలవెలబోతున్నాయి.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



పెన్నానది ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ జాన్ ఎరివిన్ పులపర్తి

కమలాపురం : ప్రస్తుతం వర్షాలు అధికంగా కురుస్తున్నాయని అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని కడప ఆర్డీఓ జాన్ ఎరివిన్ పులపర్తి తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. పట్టణంలో సకాలంలో రేషన్ పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలనుంచి అందిన సమస్యలు అలాగే రైతులకు సంబంధించిన సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. బెంగలూరు, విజయవాడ 6 లైన్ల రహదారి, కమలాపురం బైపాస్‌కు సంబంధించి భూ సేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని అదేశించారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేయాలని ఎటువంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూసించారు. అనంతరం గంగవరం వద్ద పెన్నానదిలో ప్రవాహాన్ని పరిశీలించారు. తహసీల్దార్ శివరామిరెడ్డి, సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

విద్యార్థులు సమతుల ఆహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా

వేంపల్లె : విద్యార్థులు సమతుల్య ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా తెలిపారు. బుధవారం వరల్డ్ ఫుడ్ డే సందర్భంగా మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఎన్ఎస్ఎస్ యూనిట్–14 ప్రోగ్రాం అధికారి డాక్టర్ తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమతుల్య ఆహారంపట్ల శ్రద్ధ చూపడంతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఆహారంలో తీసుకోవడంలో పాటించే విధి విధానాల అంశాలను విద్యార్థులు వివరించారు. మనల్ని నడిపించే శక్తి రూపం ఆహారమన్నారు. ఆరోగ్య అభివృద్ధికి ఆహారం అత్యంత అవసరమన్నారు. అదే విధంగా నేటి ప్రాశ్చాత్య సంస్కృతి పోకడలవల్లఎక్కువ మంది జంక్ ఫుడ్‌కు అలవాటు పడుతున్నారని, వాటి వలన మానవులు అనారోగ్యపాలవుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు విశ్వనాథ్‌రెడ్డి, కో ఆర్డినేటర్ దీప్తి, మెంటర్ మధుసూదన్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమిపూజ



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి

లింగాల : పల్లె పండుగ వారోత్సవాలలో భాగంగా బుధవారం మండలంలోని గుణకణపల్లె, మురారిచింతల గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. గుణకణపల్లె పంచాయతీలలో ఉపాధి హామీ మెటీరియల్ కాంపోనెంట్స్ కింద రూ.22.20లక్షలతో నాలుగు సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అలాగే మురారిచింతల పంచాయతీలోని గ్రామాల్లో మూడు సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.4.50 లక్షల నిధులు మంజూరయ్యాయని పీఆర్ ఏఈ మనోహర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఉపాధి హామి ఏపీఓ గంగరాజు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామి సిబ్బంది, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : మండలంలోని చెర్లోపల్లె గ్రామ పంచాయతీలోని భైరవగుట్ట వద్ద బుధవారం ఎమ్మెల్యే పుత్తా చైతన్యకుమార్‌రెడ్డి సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద రూ.6 లక్షలతో మంజూరైన రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, తహసీల్దార్ అనురాధ, ఏపీఓ ఓబులమ్మ, పిఆర్ఏఈ రహంతుల్లా పాల్గొన్నారు.

సీసీరోడ్లకు శంఖుస్థాపన

వల్లూరు (చింతకొమ్మదిన్నె) : మండలంలోని ఇప్పపెంట పంచాయతీలో బుధవారం సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి శంఖుస్థాపన చేశారు. గ్రామంలోని మహిళలు తమకు ఉపాధి పని కల్పించాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో మండల అధికారులు, సచివాలయ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా సంస్థలకు దూరంగా మద్యం షాపులు పెట్టాలి

వల్లూరు (చింతకొమ్మదిన్నె) : కడప కార్పొరేషన్ పరిధి చింతకొమ్మదిన్నె మండలం నుంచి విలీనమైన 15, 16వ డివిజన్లలో నూతనంగా ఏర్పాటుచేసిన మద్యం దుకాణాలను విద్యా సంస్థలు, ప్రార్థన మందిరాలకు దూరంగా తరలించాలని ఆర్‌సీపీ మండల కార్యదర్శి మదగలం ప్రసాద్ కోరారు. కలెక్టర్, ఎస్పీ, ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్, కడప, కమలాపురం ఎమ్మెల్యేలకు కూడా విన్నవించామన్నారు.

పల్లె పండుగ వారోత్సవాలు

పులివెందుల రూరల్ : గ్రామాలను అభివృద్ధిపరిచేందుకే ప్రభుత్వం పల్లె పండుగ వారోత్సవాలను నిర్వహిస్తుందని ఎంపీడీఓ రామాంజనేయరెడ్డి తెలిపారు. బుధవారం కొత్తపల్లి, చంద్రగిరి, మోట్నూతలపల్లె గ్రామాలలో మన అభివృద్ధి పనులకు ఎంపీడీవో భూమి పూజ కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. సుమారు రూ.3 లక్షలతో ప్రహరీ గోడ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల టౌన్ : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ఉదయం చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బొదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లోపక్కులు సలిపిరి, తల్లి(అమ్మవారు), సభ్యం(శోభి), మాగురు (మంగు), అలర్జీ, ఆనెలు, కాళ్ళు పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టి.బి. మచ్చలు, కుష్ఠు, తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. అలాగే చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణ బేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

అధిక వర్షాలతో చీడ పురుగుల ఉధృతి పెరుగుతుంది



పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

జమ్మలమడుగు : అధిక వర్షాలు పడటం వల్ల రైతుల పంట పొలాల్లో నీరు నిలబడి చీడ పురుగుల ఉధృతి పెరిగే అవకాశం ఉందని వ్యవసాయాధికారి గురుభాస్కర్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని వేమగుంటపల్లి, కొత్తగుంటపల్లె గ్రామాలలో వరి పంటను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుతం వర్షాలు ఎక్కువగా పడలేదని గురువారం భారీగా వర్షం పడితే రైతులకు సంబంధించిన పంటలు దెబ్బతినే అవకాశం ఉంది. పొలంలో నీరు నిలవడం వల్ల గాలిలోతేమశాతం పెరగడం వల్ల చెట్టుపూత రాలడం, చీడపురుగుల ఉధృతి పెరగడంతోపాటు, భూమిలో ఉండే పోషకాలు సరిగ్గా మొక్కలకు అందక ఎదుగుదల ఆగిపోతుందన్నారు. రైతులు పొలంలో ఉన్న నీటిని తీసివేయాలని, పంట ఎదుగుదలకు బూస్టర్‌డోస్ ఎరువులకు వేసుకోవాలన్నారు.

దళితులపై దాడులు అరికట్టాలి



చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న దండు వీరయ్య మాదిగ

పులివెందుల రూరల్ : దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ డిమాండ్ చేశారు. సింహాద్రిపురం మండలం బలపనూరులో దళితులైన తండ్రీకొడుకులపై కొందరు వ్యక్తులు దాడి చేసిన సంఘటన చోటు చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న ఆయన బుధవారం పులివెందులలో చికిత్స పొందుతున్న వెంకటరమణ, భార్గవ్‌లను పరామర్శించి మాట్లాడారు. వెంకటరమణ, ఆయన కుమారుడు భార్గవ్‌లను అదే గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి, గజ్జల చాణిక్యరెడ్డి చాకలి ఓబులేసు, వడ్డే శేఖర్, నాగరాజులు సోమవారం రాత్రి దళితులైన వాళ్ళ ఇంటికి వెళ్లి వారిని విచక్షణారహితంగా కొట్టి వారి పొలాలకు సంబంధించిన అగ్రిమెంట్లపై సంతకం చేయించుకున్నారన్నారు. అగ్రవర్ణాల వారి దౌర్జన్యాలను ప్రభుత్వాలు అరికట్టాలన్నారు.

వెలమవారిపల్లెలో కుక్కల స్వైర విహారం

ఆందోళనలో గ్రామస్తులు



వెలమవారిపల్లెలో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

పులివెందుల రూరల్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని వెలమవారిపల్లెలో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడులు చేస్తున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని వీధులలో ఎక్కడ చూసినా కుక్కలు ఉండటంతో చిన్నపిల్లలు, వృద్ధులు భయాందోళన చెందుతున్నారు.

ఈ మధ్య కాలంలో చిన్నపిల్లలు, వృద్ధులపై కుక్కలు దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయి. ఈ నేపథ్యంలో కుక్కల దాడి సంఘటనలో చిన్నపిల్లలు మృత్యువాతపడ్డారు. బయటకు రావాలంటే భయమేస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం కావడంతో కుక్కలు కరిస్తే చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలోని కుక్కలను పట్టుకుని దూర ప్రాంతాలకు తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

బయటకు రావాలంటే భయమేస్తోంది..



గ్రామంలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వృద్ధులమైన మేం బయటకు రావాలంటే భయమేస్తోంది.

ఇతర ప్రాంతాల నుంచి కుక్కలు గుంపులు గుంపులుగా మా గ్రామానికి వచ్చాయి. అవి వీధులలో కోళ్లను, చిన్న పిల్లలను సైతం వెంబడిస్తున్నాయి. అధికారులు స్పందించి కుక్కలను పట్టుకుని దూర ప్రాంతాలకు తరలించాలి.

– వీరమ్మ, స్థానికురాలు, వెలమవారిపల్లె

గుంపుగా వచ్చి దాడులు చేస్తున్నాయి



గ్రామంలో గుంపులు గుంపులుగా శునకాలు సంచరిస్తున్నాయి. ఇళ్లలో నుంచి బయటకు వస్తే ఒక్కసారిగా గుంపుగా వచ్చి దాడిచేస్తున్నాయి. ఉదయం, రాత్రి సమయాల్లో రోడ్లపై తిరుగుతున్న వారిపై ఎక్కువగా దాడి చేస్తున్నాయి. కుక్కలు దాడిచేయడంతో చిన్నపిల్లలు పరిగెత్తుతూ కిందపడి దెబ్బలు తగిలించుకుంటున్నారు. అధికారులు వెంటనే స్పందించాలి.

– స్వర్ణ, స్థానికురాలు, వెలమవారిపల్లె

జడివానతో రోడ్లు జలమయం



వేంపల్లెలో జలమయమైన రోడ్లు



మొగమూరు వాగును పరిశీలిస్తున్న ఎస్ఐ పెద్దఓబన్న

వేంపల్లె : అంబేద్కర్‌నగర్ ఆయా ప్రాంతాల్లో రెండు రోజులుగా వర్షం కురవడంతో రోడ్లు అన్ని జలమయం కావడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో వేంపల్లెలో అండర్ డ్రైనేజీ కోసం గుంతలు తవ్వి విడిచిపెట్టడంతో వర్షపు నీరు నిలిచిపోయింది. బుధవారం వర్షం ఎడతెరిపి లేకుండా కురవడంతో వ్యాపారంలేక వ్యాపారస్తులు విలవిలలాడారు. అయా గ్రామాల్లో సాగు చేసిన పంటల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేంపల్లెలోని పిరమిడ్ నగర్, రాజీవ్ నగర్, ఉషాకిరణ్ పాఠశాల రహదారిలో, కాలనీలో రోడ్లు అన్ని బురదమయమైంది. పులివెందుల రోడ్డులో రోడ్డంతా గుంతల మయంగా మారింది.

మొగమూరు వాగు పరిశీలన

తొండూరు : పులివెందుల–ముద్దనూరు ప్రధాన రహదారి మార్గమధ్యంలో ఇనగలూరు గ్రామం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మొగమూరు వాగును బుధవారం ఎస్ఐ పెద్ద ఓబన్న పరిశీలించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన ప్రజలను కోరారు. బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంవల్ల మరో రెండు రోజులు కూడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. కూలేందుకు సిద్ధంగా ఉన్న ఇళ్లల్లో ఎవరు నివాసం ఉండరాదన్నారు. పరివాహక ప్రాంతాల్లో నీటిలోకి ఎవరూ వెళ్లొద్దని తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తొండూరు : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల తహసీల్దార్ రామచంద్రుడు తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు పాడి రైతులు పశువులను లోతట్టు ప్రాంతాల్లోనూ, వృక్షాలు, సెల్ టవర్ల కింద మేపకూడదన్నారు. పశువులను ఎలక్ట్రికల్ స్తంభాలకు, వేలాడే తీగలకు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కట్టివేయరాదన్నారు. పాడి ఆవులను వర్షాలకు తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పంటకు రాత్రి వేళల్లో కాపలా వెళుతున్న రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే వెళ్లాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లోని వంకలు, వాగులు, నదులు, కాలువల వద్ద ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఏవైనా సమస్యలుంటే 7674950741 అనే ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

ఎర్రగుంట్లలో వర్షం

ఎర్రగుంట్ల : మండల పరిధిలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. మండల వ్యాప్తంగా 21.6 మీ.మీ. వర్షం నమోదు అయినట్లు తహసీల్దార్ శోభనబాబు తెలిపారు.


లింగాలలో 25.2 మి.మీ వర్షం

లింగాల : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం కారణంగా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి బుధవారం ఉదయం 8 గంటల వరకు 25.2మి.మీ వర్షం కురిసిందని రెవెన్యూ అధికారులు తెలిపారు. మండల వ్యాప్తంగా ఎలాంటి ప్రమాదాలు సంభవించలేదన్నారు. మరో రెండు రోజులు రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఈశ్వరయ్య అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు.

• జలజలపాతం

ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటున్న పాలకొండలు

చింతకొమ్మదిన్నె : కడప నగర సమీపంలోని పాలకొండలు ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటున్నాయి. కురిసిన వర్షాలకు కొండపై నుంచి జలపాతాలు జాలు వారుతున్నాయి. యువకులు ఎక్కువ సంఖ్యలో ఈ ప్రాంతానికి చేరుకుంటున్నారు.



పాలకొండల్లోని జలపాతం